ISSN:3048-5908 Impact Factor:6.673(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-3, (July/Aug/Sept), 2026

# ప్రసిద్ధ ప్రత్యేక వ్యాస సంకలనాలు

డా. తలారి వాసు

తెలుగు విభాగం

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం

Received: 12/07/2026
Article Accepted: 14/08/2026
Published Online: 16/08/2026
DOI:10.53414/Sahithyatharangini.2026.3.3.117

**వ్యాస సంగ్రహం:** తెలుగులో ఎన్నో సన్మాన సంచికలు, అభినందన సంచికలు, షష్టిపూర్తి సంచికలు, స్మారక, ప్రత్యేక సంచికలు ప్రచురింపబడుతూ ఉంటాయి. అందులో జ్ఞాపకం ఉంచుకో తగినవి ఉత్తమ సాహిత్య ప్రమాణాలు కలిగినవి మాత్రం మనం వేళ్ళ మీద లెక్కపెట్టగలిగినవి. ఎందుకంటే వాటిని ప్రచురించడం చాలా వ్యయ ప్రయాసలతో కూడినపని. ప్రసిద్ధ కవుల రచయితల వ్యాసాలను ఒక చోటికి చేర్చాలి. అవసరమైతే కొన్నిటిని రాయించాలి. కొన్నిటికి ప్రచురణ హక్కులను పొందాలి.ఇన్ని చేసిన తర్వాత దానిని ఒక బృహత్తర గ్రంథం గా అట్టలో లేదా కాలికో బైండ్ తో తీర్చిదిద్దాలి. ప్రత్యేక సంకలనాలన్ని అయిదారు వందల పేజీలు దాటి వెయ్యి పుటలకు దగ్గరగానే ఉంటాయి. అటువంటి పుస్తకాన్ని వేయిప్రతులు వేయాలంటే లక్షలాది రూపాయల ఖర్చుతో కూడిన పని. కాలం కూడా ముఖ్యమైన అంశం. వీటన్నిటిని దాటుకొని సారస్వత సేవ చేయాలని కంకణం కట్టుకున్న మహనీయులు వ్యయ ప్రయాసలు కోర్చి అద్భుతమైన సంచికలని తెలుగు పాఠక లోకానికి అందించి శాశ్వత కీర్తిని పొందారు. ఆ సంచికలను చూస్తున్నప్పుడు, పరిశీలిస్తున్నప్పుడు ఆ మహనీయులతో మనం మాట్లాడుతున్నట్లు కలిసి జీవిస్తున్నట్లు అనిపిస్తుంది. మన వీపుతట్టి ముందుకు నడిపిస్తున్నట్లుంటుంది.

**కీలక పదాలు:** ప్రత్యేక వ్యాస సంకలనాలు, త్రిలింగ రథోత్సవ సంపుటం, శాంతి, సాహితీ వాల్లభ్యము. అక్షరార్చన. శ్రీ రాజరాజ నరేంద్ర పట్టాభిషేక సంచిక మొదలైనవి.

**ప్రత్యేక వ్యాస సంకలనాల విశ్లేషణ:** ఒక బృహత్తర సంచిక వెనుక ఎందరో పడిన శ్రమ ఉంది.చాలా యంత్రాంగం, మంత్రాంగం ఉంది. అప్పుడే సంచిక సర్వాంగ సుందరంగా మన చేతిలో ఉంటుంది. దానిని చూసిన వెంటనే మనకు ఒక ఆనందం కలుగుతుంది. అది అనిర్వచనీయమైనది. లోపలి పేజీల్లోకి

ISSN:3048-5908 Impact Factor:6.673(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-3, (July/Aug/Sept), 2026

వెళ్తున్నప్పుడు ఎవరిని దృష్టిలో పెట్టుకుని ఆ సంచిక ప్రచురించబడిందో వారి జీవితాన్ని మనం చదువుతుంటే స్ఫూర్తిదాయకాంశాలు ప్రేరణనిస్తాయి. తర్వాత విషయ సూచిక చూస్తాం. లబ్ధ ప్రతిష్ఠులైన సాహితీవేత్తల రచయితల పేర్లతో ఆ వ్యాసాలు ఉంటాయి. వాటిని చదువుతుంటే వారందరూ మనతో మాట్లాడినట్లే. ఆ మహత్తర వ్యాసాలు విజ్ఞానదాయకాలు. కొన్ని అరుదైనవి. కొన్ని ఆలోచింప చేసేవి. కొన్ని అనుమాన నివృత్తిని కలిగిస్తాయి. మొత్తంగా మనకు విస్తృతమైన సాహిత్య జ్ఞానాన్ని కలిగిస్తాయి. అలా అందించే సంచికల్లో కొన్ని అరుదైన సంచికలను సాహిత్య విద్యార్థుల కోసం, పరిశోధకుల కోసం కొంత సమాచారాన్ని ఈ వ్యాసంలో ఉంచుతున్నాను. కేవలం సమాచారంగా కాక అక్కడక్కడ ఉదాహరణలు ఇచ్చాను. ఈ వ్యాసం ద్వారా అమూల్యమైన కొన్ని సంచికలు పాఠకులు అధ్యయనం చేస్తారని వాటి కోసం అన్వేషణ సాగిస్తారని నేను భావిస్తున్నాను.

***1) "త్రిలింగ" రజతోత్సవ సంపుటము*:** త్రిలింగ పత్రికా సంపాదకులు, వావిళ్ళ ముద్రణాలయ యజమానులైన భాషోద్ధారక శ్రీ వావిళ్ళ వేంకటేశ్వర శాస్త్రి గారి సన్మాన సంపుటం. త్రిలింగ పత్రిక 1916లో స్థాపించబడి పాతికేళ్లపాటు నిర్విరామమైన భాషా సాహిత్య సేవలను సమాజానికందించింది. ఒక శతాబ్దం పాటు వావిళ్ళ ముద్రణాలయం ఎన్నో గ్రంథాలను ప్రచురించి తెలుగు భాషా సాహిత్యాలకు ఎనలేని సేవలు చేసింది. ఈ రెండు సందర్భాలను పురస్కరించుకొని శ్రీ వావిళ్ళ వెంకటేశ్వర శాస్త్రి గారిని సన్మానం చేసిన సందర్భంలో వారికి అభినందనలు అందిస్తూనే అత్యంత విలువైన 80 సాహిత్య వ్యాసాల సమాహారంగా 930 పుటలతో త్రిలింగ రజతోత్సవ సంపుటాన్ని 1941లో ప్రచురించారు.

మనకు తెలుగులో ఉన్న చాలా తాళపత్ర గ్రంథాలను చేతివ్రాత ప్రతులను మొదటిసారిగా ప్రచురించి పుస్తక రూపంలో సమకూర్చిన మహానుభావులు శ్రీ వావిళ్ల రామస్వామి శాస్త్రి. మద్రాసు నగరం ప్రచురణలకు వేదిక. ఆయన సరస్వతీ నిలయ ముద్రాక్షరశాలను 1854 సంవత్సరంలో స్థాపించి ప్రచరణలు ప్రారంభించారు. 78 సంవత్సరాల స్వల్ప కాలంలో శ్రీమద్రామాయణం, భాగవతం, సంస్కృత తెలుగు కావ్యాలను సుమారుగా 50 గ్రంథాలను ప్రచురించారు. స్వయంగా రామస్వామి శాస్త్రులు సంస్కృత ఆంధ్ర భాషల్లో అఖండ పండితులు. మహామహుపాధ్యాయ కొక్కొండ వెంకటరత్నం పంతులు వీరికి సహకారంగా ఉండేవారు.

రామస్వామి శాస్త్రి కాలం చేసిన తర్వాత ముద్రణాలయ కార్యక్రమాలు చాలాకాలం నిలిచిపోయాయి. అప్పటికి వావిళ్ళ వెంకటేశ్వరశాస్త్రిది చిన్న వయసు.వీరు కళాశాల చదువుల్లో ఉండగానే 1960లో సరస్వతీ ముద్రణాలయాన్ని వావిళ్ళ ముద్రణాలయంగా పేరు మార్చి సాంస్కృతిక

ISSN:3048-5908 Impact Factor:6.673(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-3, (July/Aug/Sept), 2026

పునరుజ్జీవనానికి కృషి చేస్తున్న బెంగాల్ రచయితల రచనలను, నవలలను, బంకించంద్ర చటర్జీ ఆనందమఠం వంటివి తెలుగు అనువాదాన్ని ప్రచురించి ప్రజల్లోకి తీసుకువచ్చి జాతీయోద్యమానికి ప్రేరణనిచ్చారు. తెలుగు సంస్కృతాల్లో 900 గ్రంథాలు, తమిళంలో 60, ఇంగ్లీషులో అనేకం ప్రచురించారు. సుప్రసిద్ధ పండితులైన అక్కిరాజు ఉమాకాంత విద్యాశేఖరుల సహాయంతో 1916లో "త్రిలింగ" అనే తెలుగు మాసపత్రికను స్థాపించారు. తర్వాత దానిని పక్షపత్రికగా వారపత్రికగా మార్చి 22 సంవత్సరాలు నడిపారు. ఏదో ఒక రీతిగా పుస్తకాలను అచ్చువేసి డబ్బు చేసుకుందామనే ఆలోచన లేకుండా తెలుగు సంస్కృత భాషలలోని ప్రాచీన ప్రౌఢ రచనలను తెలుగులోకానికి సమర్పించడం తన జీవిత ధర్మంగా స్వీకరించి పనిచేశారు. అటువంటి భాషా సేవకుని అభినందించుకునే సందర్భంలో ఈ ప్రత్యేక సంచిక పెద్ద పుస్తకంగా నేటికీ అరుదైన సంచికగా నిలిచింది.

ఈ సంచికలో ఉన్నవి 80 వ్యాసాలు. దేనికదే గొప్ప వ్యాసం. వ్యాసకర్తలంతా మహా పండితులు, లబ్ధ ప్రతిష్ఠులు. రచనలో కొద్దిపాటి గ్రాంధిక పద్ధతి కనిపిస్తుంది. చదవడానికి ఇబ్బంది మాత్రం కాదు. మేడేపల్లి వెంకటరమణాచార్యులు రచించిన "అలంకార శాస్త్రోత్పత్తి" వ్యాసం ఇందులో మొదటిది. ఈ సంచికలో ప్రతి వ్యాసం పది పదిహేను పుటల నిడివి కలిగి ఉంది. భాగవతుల కుటుంబరావు "రసవాదం" జమ్మలమడక మాధవరామశర్మ "రసానుభూతి" డాక్టర్ చిలుకూరి నారాయణరావు "మను చరిత్ర - పెద్దన్న గారి పెద్దతనము" వంటి వ్యాసాలు సాహిత్యాంతర్గతమైన తత్వాన్ని మనకందిస్తాయి. చిలుకూరి వారి వ్యాసంలో "పెద్దన్న సృష్టి చేసినది గంధర్వ నగరము. అక్కడ కాలము లేదు.దేశము లేదు. కవి గారడీ వాడు. కుంచెవిప్పి ఆడించి ఎట్లు కమ్మంటే అట్లా అవుతుంది. ఆ అద్భుతమును చూచి ఆనందించడానికి మనమధికారులము" అన్నారు. పాఠకుడు కావ్యానందాన్ని పొందడమే కవి ఉద్దేశం. రచనలో ఉండే తర్కం, లోటుపాట్లు తర్వాత కవిత్వంలోని రసానుభూతిని అనుభవించడం కవి అందిస్తున్న భావాన్ని పాఠకుడు అందుకోవడం దాని ప్రయోజనాన్ని పొందడం ఇదే కవిత్వ లక్షణం. వ్యాసకర్త చివరిలో ఆంధ్రుల చరిత్ర తత్వమే మను చరిత్రలో ఉందన్నారు. "స్వరోచి గంధర్వుడా? మానవుడా? అతనికి, వనదేవతలకు పుట్టిన స్వారోచి మనువు మాట ఏమిటి? అందరునూ మనుషులే. మనుషులైన దేవతలు. ఆంధ్రులు విశ్వామిత్ర సంతతి వారు. విశ్వామిత్రుడు దేవత్వమును సంపాదించిన మానవుడు. మేనక మానవత్వమును పొందిన దేవతా స్త్రీ. కాని మనకేమో వారిద్దరును మానవులే. వారి సంతతివారైన ఆంధ్రులలో మానవత్వం ప్రకోపించినప్పుడు నిరుత్సాహము కలుగుతుంది. నిరుత్సాహస్థితిలో దేవత్వము పొడమూపి

ISSN:3048-5908 Impact Factor:6.673(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-3, (July/Aug/Sept), 2026

ధైర్యోత్సాహములను పురికొల్పుతుంది. ఇది ఆంధ్రుల చరిత్ర తత్వము. ఆ తత్వమే మన చరిత్రలో నిరూపితమైనది."

కుందూరి ఈశ్వర దత్తు "శ్రీనాథుని భీమేశ్వర పురాణం" వ్యాసంలో తూర్పుగోదావరి జిల్లాలోని ద్రాక్షారామానికి ప్రాచీన శాసనాల్లో "డాకిరేమి" అనే పేరు ఉందని ఆ డాకిరేమి అనే దేశీయ నామం ద్రాక్షారామం అనే సంస్కృత రూపాన్ని దాల్చిందని తెలిపారు. చారిత్రాత్మకమైన అక్కడి శివాలయ వృత్తాంతానికి ఒక పురాణాన్ని పుట్టించి డాకిరేమిని ద్రాక్షారామంగా మార్చారని రాశారు.

కాలం గడిచే కొద్ది ఎన్నో పేర్లు ఇలా మారిన సందర్భాలు ఉన్నాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమస్య. ఇది అసలు పేరు, ఇప్పుడు ఇలా పిలుస్తున్నారు అని అన్నిచోట్ల వింటుంటాం. ఆ మారిన చరిత్రనో, క్షేత్ర మహాత్మ్యాన్ని చదివి విని సంతోషిస్తాం.

పీఠికాపురం పిఠాపురంగా, చాళుక్య భీమవరపుకోట సామర్లకోటగా, కోకనద కోకెనడా కాకినాడగా, రాజమహేంద్రపురం రాజమహేంద్రవరం రాజమహేంద్రి రాజమండ్రి గా, నిరవద్యప్రోలు నిడదవోలుగా, హేలాపురి ఏలూరుగా, క్షీరపురి పాలకొలను పాలకొల్లుగా, రాజప్రోలు రాజోలుగా, నరసింహపురం నరసాపురంగా మారిపోయాయి. పర్వతపు ఎత్తునుండి క్రిందకి ఉన్న మార్గం వాలు తెరువు వాల్తేరు గా మారిందని చెబుతూ ఉంటారు. ప్రజల నోళ్ళలో వ్యవహారికంగా వారికి వీలున్నట్లుగా తేలికగా ఉండేలాగున పలకడం వలన మారిపోతూ ఉంటాయంటారు భాషా శాస్త్రవేత్తలు.

నిధిచాల సుఖమా, రాముని సన్నిధి సేవ సుఖమా... అని పలికిన త్యాగరాజ స్వామి గురించి "త్యాగరాజ ప్రశస్తి" అనే వ్యాసాన్ని శ్రీపాద కామేశ్వరరావు రాశారు. కవుల ప్రయోగాలు తరువాతి కవులు వాడే పద్ధతి, కొంతమంది ప్రయోగించే మాటల గురించి చెళ్లపిళ్ల వెంకట శాస్త్రి "అభ్యనుజ్ఞ" వ్యాసం రాశారు. ఆ వ్యాసంలో ఒకచోట ఒక విద్వాంసుని మాటలని ఉదాహరించారు. కవులలో తారతమ్యాలను నిర్ణయిస్తూ ఉపయోగించే మాటలు నవ్వు పుట్టించేవిగా ఇలా ఉంటాయట.

"అయ్యా! చామకూర కవిని గురించి మీ అభిప్రాయమేమి ?వా! అబ్బో! అమ్మ మొగుడు. మరి అల్లసాని కవో? చెప్పేదేమిటి, అమ్మమ్మ మొగుడు.
గురుత్వ లఘుత్వాలను ఈ మాదిరి పదాలతో నిర్ణయించేవారు. ఇప్పుడు కూడా చాలామంది ఉన్నారు. సినిమాలు చూసి ప్రభావితులవుతున్న కొత్తతరం వారైతే "సూపరు, కేక" అంటున్నారు. ఇంకా గొప్పది అని చెప్పడానికి ఈ కేకలలో కెవ్వుకేక ఒకటి ఉంది దానిని ఉపయోగిస్తున్నారు.

ISSN:3048-5908 Impact Factor:6.673(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-3, (July/Aug/Sept), 2026

"ఆంధ్రము - నన్నయకు పూర్వ యుగము" వ్యాసాన్ని కె.వి. సుబ్బరాఘవకవి రాశారు. వ్యాసంలో చివరి వాక్యం "కావున నన్నయకు పూర్వముకూడా సాహిత్యముందని నా మనవి అని రాశారు. 15 పుటల వ్యాసం నన్నయకు ముందున్న సాహిత్య స్థితిని తెలుపుతుంది. చదివి తీరాల్సిన వ్యాసం. ఉత్పల వెంకట అప్పలాచార్యులు "ఆంధ్ర నాటక రంగం", శ్రీపాద సుబ్రమణ్యశాస్త్రి "టాకీలూ - నాటకాలు", కురుగంటి సీతారామయ్య "ఆంధ్ర నాటక కళాపరిషత్తు" వ్యాసాలు నాటకరంగానికి సంబంధించినవి. జటావల్లభులు పురుషోత్తం "హిందూమత ప్రమాణములు", పేరి లక్ష్మీనారాయణ శాస్త్రి "సాంఖ్యదర్శన సారము" వంటివి ఆధ్యాత్మికాలు.

త్రిలింగ పత్రికను కొంతకాలం చక్కగా నిర్వహించిన నేలనూతల సుబ్బారాయుడు "కవి పోషణ" వ్యాసంలో కవులు పేదవారని వారిని పోషించే దాతలు అవసరమని నాటి రాజ పోషణ నేటి పరిస్థితుల ప్రభావాలను విశ్లేషించారు. కవులకు ఇవ్వవలసిన ప్రోత్సాహాన్ని తెలిపారు. కవులు ప్రజల హృదయాల్లో శాశ్వతంగా జీవించి ఉంటారని సాహిత్యం ఉన్నంతకాలం వారిని మర్చిపోరని తెలిపి "మనగల ఒక్క పద్యమును వ్రాసి ఘోర సంగ్రామమందు క్లిష్ట పరిస్థితులలో అత్యంత ప్రతిభతో రిపుని ఎదుర్కొని పోరి తన ప్రాణములనర్పించిన పేరు తెలియని వీరాగ్రేశరునిచాడ్పున చాటుధారలను రచించి దివంగతులైన మహామహులెందరో సాహిత్యం ఉన్నంతకాలము మానవుల హృదయ సీమలలో అగ్రస్థానమునలంకరించువారున్నారు.

డా. గిడుగు వెంకట సీతాపతి "నన్నయభారతము", శ్రీపాద లక్ష్మీపతి శాస్త్రి "గ్రంథవ్యాప్తి" వంటి వ్యాసాల సమాహారం త్రిలింగ రజతోత్సవ సంపుటం. మందంగా ఉన్న పేపర్ పై చక్కని అక్షరాలలో హార్డ్ బైండింగ్ తో 1941లో మద్రాసులో ప్రచురించిన ఈ సంపుటం అత్యద్భుతమైన సమగ్రమైన సాహిత్య పరిజ్ఞానాన్ని పాఠకులకు అందిస్తుంది. సాహిత్య విద్యార్థులకు పరిశోధకులకు ఇది మంచి ఆధార గ్రంథం.

***2) సరస్వతీ సామ్రాజ్యం*:** 13 డిసెంబర్ 1942 తేదీన గుంటూరులో జరిగిన ఆంధ్రదేశ గ్రంథాలయ సేవక చతుర్థ మహాసభలో సమర్పించిన అయ్యంకి వెంకటరమణయ్య గారి సన్మాన సంచికయే "సరస్వతీ సామ్రాజ్యం" దీనికి ప్రదాత సర్ కట్టమంచి రామలింగారెడ్డి. ప్రముఖ కవులు, రచయితలు రచించినవి 25 వరకు పద్యగేయ ఖండికలు, 85 తెలుగు సారస్వత గ్రంథాలయ వ్యాసాలు ఇందులో ఉన్నాయి. 700 పాటలతో కాలికో బైండింగ్ పుస్తకమిది.

మామిడిపూడి వెంకటరంగయ్య, మల్లంపల్లి సోమశేఖరశర్మ, బెల్లంకొండ రాఘవరావు సంపాదకులు. సన్మాన సంచిక ప్రారంభకులు ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రో ఛాన్సలర్ జయపురం మహారాజు శ్రీ

ISSN:3048-5908 Impact Factor:6.673(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-3, (July/Aug/Sept), 2026

విక్రమ దేవవర్మ. ఈ గ్రంథంలో 134 పుటలు అయ్యంకి వారి గురించిన అభినందన వ్యాసాలు, ప్రశంసా పద్యాలున్నాయి.

నవభారత నిర్మాణం జరిగే ప్రయత్నాల్లో గ్రంథాల ఉద్యమం, వయోజన విద్యా ప్రచారం ప్రధాన స్థానంలో ఉండేవి. నూటికి తొంభై మంది నిరక్షరాస్యులు ఉన్న ఆనాటి రోజుల్లో అక్షరాస్యతను పెంచే ప్రయత్నంలో భాగంగా గ్రంథాలయాల ప్రయోజనాన్ని విస్తరించాల్సిన అవసరం విశేషంగా ఏర్పడింది.ఆ అవసరాన్ని తీర్చిన మహనీయులు శ్రీ అయ్యంకి వెంకటరమణయ్య."గ్రంథాలయ యాత్రాదళము"లను నడిపి గ్రంథా లయోద్యమ ప్రచారానికి నవ్య విధానాలను కల్పించిన కీర్తి వీరికి దక్కింది. సర్వతోముఖంగా, సార్వజనీనంగా సరస్వతీ వైభవాన్ని ఆంధ్రదేశమంతటా విస్తరింప చేయడమే ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారు. దివ్య గంగను భూలోకానికి తెచ్చిన భగీరథుని వలె సహస్రాధిక గ్రంథాలయాల ప్రతిష్టకు కారణభూతులై ఆధునిక యుగములో "సరస్వతీ సామ్రాజ్య ప్రతిష్ఠాపనాచార్య" బిరుదునకు సర్వ విధాల అర్హతను సంపాదించుకున్నారు. తెలుగు, ఇంగ్లీషు భాషల్లో ప్రచురించిన సంచికలను అయ్యంకి వెంకటరమణయ్య గారికి సమర్పిస్తూ శ్రీ కట్టమంచి రామలింగారెడ్డి ప్రసంగం కూడా ఈ సంచికలో ఉంది.

శ్రీ రాయప్రోలు సుబ్బారావు అయ్యంకి వారితో ఉన్న అనుభవాన్ని "భావ స్థిరాణి జననాంతర సౌహృదాని" అనే వ్యాసంలో వివరించారు.

ఇంకా - వ్యాసాల విషయానికొస్తే రాఘవ అయ్యంగార్ రచించిన 16 పుటల "లలిత కళలు-కవిత్వము- విమర్శనము" అనే మంచి వ్యాసం ఉంది. కవి, కావ్యం, కావ్య లక్షణాలు, కావ్య భేదాలు, కావ్యాంగాలు, చిత్రకళాకవిత్వాల తారతమ్యం,పాశ్చాత్య సాహిత్య లక్షణాలు, విమర్శన తత్వము వంటి విషయాల్ని కూలంకషంగా చర్చించారు. సాహిత్య విద్యార్థులకు ఈ వ్యాసం చాలా అవసరం.

మరొక అద్భుతమైన వ్యాసం జమ్మలమడక మాధవరామశర్మ గారి "నాటకము- నాట్యము" వారణాసి రామమూర్తి "శ్రీ గోస్వామి తులసీదాసు"వ్యాసంలో శ్రీరామచరిత మానసాన్ని మనసారా విశ్లేషించారు. వ్యాసం చివర్లో రామచరిత మానస గ్రంథం గురించి మహాత్మా గాంధీ గారి అభిప్రాయం ఉంది అది... "ఒకానొక గ్రంథము సర్వోత్తమమైనదని చెప్పినప్పుడందొక్క దోషము కూడా లేదని అనుకొనరాదు. కానీ రామచరిత మానసము వలన లక్షల కొలది స్త్రీపురుషులకు మనశ్శాంతి లభించినదనుటలో సందేహము లేదు. ఈశ్వరుని పట్ల విముఖత్వము చూపిన వారందరూ ఈశ్వర భక్తులయిరి.అట్లు నేటికీని అనేకుల హృదయ పరివర్తనము జరుగుచున్నది. "మానసము" నందలి ప్రతి పంక్తియు భక్తి రసపూరితము. మానసమనుభవ జ్ఞానమునకు నిధి."

ISSN:3048-5908 Impact Factor:6.673(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-3, (July/Aug/Sept), 2026

నండూరి రామకృష్ణమాచార్యులు "నవ్య సాహిత్యం", వావిలాల సోమయాజులు "ఆంధ్రుల సంగీత నాట్యములు", పుట్టపర్తి నారాయణచార్యులు "తిక్కన- కుమార వ్యాసుడు", దివాకర్ల రామమూర్తి "గొల్ల భాగవతులు" వంటి సుదీర్ఘమైన వ్యాసాలు ఇందులో ఉన్నాయి. చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు 1914లో రాసిన "గ్రంథాలయ వేదము" గ్రంథాలయాలకు సంబంధించిన వ్యాసాలకు ముందు ప్రచురించారు.

"వాయువు ఎల్లవారికి ఎట్లు స్వాధీనమైయున్నదో జ్ఞానము కూడా అట్లు స్వాధీనము కావలయును. ఉదకము ఎల్లవారికి ఎట్లు సేవ్యమైయున్నదో జ్ఞానము కూడా అట్లు సేవ్యమై యుండవలెను. సూర్యచంద్ర మండలములు తేజస్సు ఎల్ల వారికి ఎట్లు సౌఖ్య ప్రదముగానున్నదో జ్ఞానము కూడా అట్లు సౌఖ్యప్రదము కావలయును." (గ్రంథాలయ వేదము- చిలకమర్తి లక్ష్మీ నరసింహం)

***3) శాంతి*:** ప్రఖ్యాత విద్వత్కవి పోషకులు, మహాదాతలు శ్రీ ఏకా ఆంజనేయులు (గుంటూరు) ధర్మపత్ని 1961లో కీర్తిశేషురాలైన శ్రీమతి ఆదిలక్ష్మమ్మ గారి స్మృతి చిహ్నంగా వెలువడిన సాహిత్య సంకలన గ్రంథమే "శాంతి" 825 పుటలతోగల కాలికో బైండింగ్ పుస్తకమిది. ముఖచిత్రంపై పూర్ణకుంభం వెనుక అట్టపై ఎగురుతున్న పావురం శాంతి చిహ్నంగా ముద్రించారు.

ప్రచురణ కాలం నాటి రచనలను సేకరించి ఈ సంకలనం తయారు చేశారు. దీనికి నిర్మాత ఏకా ఆంజనేయులు. సంధాత, సంపాదకులు భార్గవ విద్యాదేవ కులపతి (శ్రీ పివిఎల్ వి ప్రసాదరావు).

"శాంతి" ఒక అధునాతన సాహిత్య సంకలనం. పద్య గద్యగేయాత్మకమైన రకరకాల రంగురంగుల రచన ప్రసూనాలతో కూర్చిన కదంబం, సాహిత్యామృతం జీవితంలోని వేదనలన్నిటినీ మాధురులుగా మార్చే మంత్రశక్తి సమన్వితం. రమణీయంగా, ప్రియకాంతలాగా కర్తవ్య బోధచేసి లోకాన్ని లాలించే పాలించగల శక్తి సాహిత్యానికుంది. మనిషి మనసులోని చీకటిని పారద్రోలి కళ్ళ ముందు వెలుగుదారులని పరచి ముందుకు కదిలించే మహిత శక్తి విద్య. ఈ ఉత్తమ ప్రయోజనాన్ని సౌందర్యం ద్వారా ఆనందం ద్వారా అనాది నుంచి మన సాహిత్యం తన లక్ష్యంగా గ్రహించి కృషి చేస్తుందని శాంతి సాహిత్య సంకలనాన్ని తన భార్య పావన స్మృతికి అంకితమిచ్చి శాశ్వతమైన స్మారక చిహ్నంగా నిలుస్తుందని ఆయన ఆశిస్తూ జగత్తులో అక్షర రమ్యమైన స్మృతి చిహ్నాలు ఖిలము కాకుండా నిలబడగలవని విశ్వసించారు ఏకా ఆంజనేయులు గారు. ఈ సంకలనం వల్ల వచ్చే విక్రయ ధనాన్ని గుంటూరులోని బండ్లమూడి హనుమాయమ్మ హిందూ బాలిక బహుళార్ధ సాధక పాఠశాలకు సమర్పించారు. సరస్వతీమూర్తులై విలసిల్లవలసిన స్త్రీలు విద్యారంగంలో ఇంకా పురోగమించవలెనని విద్యావతి అయిన వనిత గృహిణిగా, జననిగా జాతిని మహోజ్వలంగా రూపొందించగలరని విశ్వసిస్తూ, ఆశిస్తూ ఈ సంకలన సర్వస్వామ్యాలను స్త్రీ విద్యాభివృద్ధికి

సేవ చేస్తున్న ఆ సంస్థకు నివేదించారు. భార్గవ విద్యాదేవ కులపతి గారు తమ సంపాదక వ్యాసంలో ఆంజనేయులు గారి గురించి శాంతి సంకలనం గురించి రాసిన కొన్ని మాటలు ఇక్కడ పదిల పరుస్తున్నాను.

"శాశ్వతత్వం కోసం ఒక వ్యక్తి మహా భవనం నిర్మిస్తాడు. మరొక మనిషి మహా వనం సృష్టిస్తాడు.మరో కాలవిజేత కవనం నిర్మిస్తాడు. దేవాలయాలు, మహాభవనాలు, విచిత్ర భౌతిక నిర్మాణాలు కాలగర్భంలో కలసిపోవచ్చు. కవిత కాలానికి ఎదురీదుతుంది. అందుకే కాల ప్రభావాన్ని గుర్తించిన మహా చక్రవర్తులు కవి పోషకులుయినారు. కవులతో పాటు వారునూ శాశ్వతత్వాన్ని సంపాదించుకున్నారు. అట్టివారిలో అధునాతనంలో గుంటూరు పట్టణ సంవాసి శ్రీ ఏకా ఆంజనేయులు గారొకరు. రస హృదయులూ వారి దాన స్రవంతిలో స్నానమాడని ఆంధ్ర కవులు లేరంటే అది స్వభావోక్తి. బహుళ గ్రంథముద్రణ, బహుళకవి సన్మానకరణ, బహుళ వితరణ సహజ గుణమైన శ్రీ ఆంజనేయులు గారు ఇతరులు ఊహింపలేని అనేక సత్కారాలు చేసి చూపి ఒక ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడపడం మన కళ్ళ ముందు కనిపించే దృశ్యం. లోకోపకార దృష్టి, ధార్మికచింత కలిగిన హృదయ సంస్కృతి ఫలితంగా ఈ సీమలో అనేక సత్కారాలు జరిగాయి. హృదయస్వరీ సంస్కృతి శాశ్వతత్వ విరచనాభావులైన శ్రీ ఆంజనేయులు గారి సంకల్ప స్వరూపమే ఈ శాంతి. కీర్తిశేషురాలైన వారి సతీమణికి చిహ్నిత పరమలోక విశ్రాంతి. దుర్వార బాధాతప్తులైన వారి హృదయమునకు ఒక అపగత కాంతి. నవ్య దివ్య భావనా క్రాంతి. సాహిత్య లోకానికి ఒక వినూత్న విద్యుత్కాంతి. ఈ శాంతి సౌమనస ప్రశాంతి."

మన మనసుకు ప్రశాంతతను కలిగించే ఈ "శాంతి" సాహిత్య సంకలనంలో పద్య గద్య గేయ కవిత మొదలగు అంశాలన్నీ కలిపి 280 ఉన్నాయి. దీనిని బట్టి సంకలనం ఎంత పెద్దదో, ప్రయోజనకరమైందో దీని ప్రచురణ వెనుక ఎంత కృషి జరిగి ఉంటుందో మనమూహించవచ్చు. శ్రీ కాశీ కృష్ణాచారులు "సంస్కృత భారతి" స్తుతితో సంకలనాంశాలు మొదలయ్యాయి. కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ "మల్లికార్జున స్తుతి", "శశి దూతము", కరుణశ్రీ కవిత కవిత్వం ఎలా ఉండాలో చెప్పిన ఉత్పలమాలిక ప్రారంభపుటల్లో మనకు దర్శనమిస్తాయి. శ్రద్ధాంజలి శీర్షికన గుర్రం జాషువా 21 పద్యాలు రాశారు. ఈ సందర్భంలో ఒక మాట జాషువా గారు ఏకా ఆంజనేయులు గారు మంచి మిత్రులు. ఏకా ఆంజనేయులు గారి ఔదార్యంతో జాషువా గారు ఎన్నో ఆర్థిక సమస్యల నుంచి బయటపడ్డారట. జాషువా గారిని ఆదరించిన పరమ బ్రాహ్మణోత్తములు ఆంజనేయులు గారు. స్నేహ సామ్రాజ్యంలో కులానికి తావు లేదు. ఆంజనేయులు గారి విశాల హృదయానికి ఒక ఉదాహరణ.. జాషువా గారు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సమయంలో ఆంజనేయులు గారు ఒకసారి కవర్లో పాతిక రూపాయలు పెట్టి ఆ కవర్లో ఒక కాగితం మీద మీ దేవుడు కలలో

ISSN:3048-5908 Impact Factor:6.673(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-3, (July/Aug/Sept), 2026

కనిపించాడు మీకు 25 రూపాయలకు పంపించమన్నాడు అని రాశారట. అది చూసి జాషువా గారు డబ్బులు తీసుకుని ఒక కాగితం మీద మరి మీ దేవుడు ఆ 25 పక్కన 0 పెట్టమని చెప్పలేదా అని రాసి పంపించారట. దానికి ఆయన 250 రూపాయలు పంపించారట. ఆ రోజుల్లో 250 అంటే సాధారణ విషయం కాదు. జాషువా గారికి ఏకా ఆంజనేయులు గారికి ఉండే స్నేహబంధం అంత గొప్పది.

శ్రీ అమరేంద్ర "అందమె ఆనందం" వ్యాసంలో మనిషి ఆనందంగా జీవించగలగడానికి గల సూత్రాలను వివరించారు. "కళా శాంతి" వ్యాసం జమ్మలమడక మాధవరాయశర్మ గారిది. ఇదొక అపురూపమైన వ్యాసం. ఇది చదివి తీరాల్సినది. సర్వసహృదయములకు స్వస్పంద సుందరమై స్వాత్మ సంవేదన సంతర్పణ మొనరించుట సచేతః స్వాత్మ దర్శనము. దర్శన పదసంచారమే కళా శాంతి.శాంతి మూలమైన శ్రమము సర్వసామితేయులకు సిద్ధ భావము. కళామార్గము అనేక విధముల సాధ్యభావములనూ కొల్పియు పర్యవసానమున సిద్ధభావాన్ని ఆపాదింపగలదు. ఇది కళాశాంతి."

అక్కిరాజు వెంకటేశ్వరశర్మ "కరుణ రసానుభూతి" వ్యాసం విశేషమైనది. పివిఎల్ నరసింహారావు "శాంతి" వ్యాసం దేశశాంతిని ఆకాంక్షించింది. "గమ్యం తెలియకుండా సాగిపోతున్న ఈ సమాజం శాంతిభద్రతలు లేనిదే మనజాలదు. పరస్పర విద్వేషాలకు స్వస్తి చెప్పి ప్రేమబీజాలను నాటనిదే ధర్మాన్ని నెలకొల్పజాలదు. సత్యాహింసలు మంత్రాక్షరాలలా జపించి ఆచరించనిదే ప్రగతి పదం పయనించ జాలద"ని హెచ్చరించింది. లంకా సీతారామశాస్త్రి "గీర్వాణ వాణీ గాంభీర్యము" వ్యాసంలో వేదార్థ ప్రతిపాదనం, ధర్మశాస్త్ర, తర్కశాస్త్ర, ఉత్తర మీమాంస, జ్యోతిశ్శాస్త్ర ఆయుర్వేదాలను విశ్లేషించింది. ఆకుండి రామశర్మ "త్యాగబ్రహ్మ", దువ్వూరి వెంకటరమణశాస్త్రి "ఉక్తిలాలిత్యము", జీవి కృష్ణారావు "నిర్వాణ పరీక్ష", జంధ్యాల మహతీ శంకర్ "కృష్ణపక్షంలో ప్రకృతి", ముదిగొండ వెంకట రామశాస్త్రి "అద్వైత వేదాంత దర్శనము", ఓరుగంటి నీలకంఠశాస్త్రి "భారతీయ దర్శనములు", గూడూరు నమశ్శివాయ "తాంబూల సేవన ప్రశంస", బెజవాడ గోపాలరెడ్డి "రవీంద్రుని సౌందర్యాదర్శము" వంటి విలువైన సాహిత్య వ్యాసాలు శాంతిలో ప్రచురింపబడి మనకు ప్రశాంత సాహిత్య జ్ఞానాన్ని అందిస్తాయి.

ఏకా ఆంజనేయులు గారు వారిని గూర్చి గాని, వారి అర్ధాంగిని గూర్చి కానీ ఒక్క వాక్యము ఈ బృహద్గ్రంథంలో ఉండరాదని, సార్వజనీయమైన సార్వ కాలికమైన ఒక సాహిత్య నిర్మాణం కావాలి గాని తాత్కాలిక ప్రయోజనం అనవసరమని భావించి దానికై తమ దంపతుల గూర్చి ఒక్క వాక్యం ఉండరాదని నియమం పెట్టారట. ఇది ఎటువంటి ఆలోచన పద్ధతి. ఈ రీతిగా ఆలోచించేవారు లోకంలోనే అరుదుగా

ISSN:3048-5908 Impact Factor:6.673(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-3, (July/Aug/Sept), 2026

ఉంటారు. తాత్వికమైన జ్ఞాన దృష్టితో ఫలితం పట్ల బ్రహ్మార్పణపరుడై తమ కర్తవ్యాన్ని నెరవేర్చి శాంతి బృహత్ కవితా, వ్యాస సంకలనాన్ని సాహిత్య లోకానికి అందించిన కర్మయోగి శ్రీ ఏకా ఆంజనేయులు గారు.

***4) సాహితీ వాల్లభ్యము*:** "సాహితీ వాల్లభ్యము" రెండు సంపుటాలు. సాహితీ వల్లభ, ఆంధ్రభోజ శ్రీ ముళ్లపూడి తిమ్మరాజుగారి అభినందన సంపుటాలు. 1968లో పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణానికి చెందిన శ్రీ నరేంద్రనాథ సాహిత్య మండలి ప్రచురించింది. శ్రీ పిల్లలమర్రి మార్కండేయశాస్త్రి, శ్రీ మధిర భానుమూర్తి, శ్రీ ఏలూరుపాటి అనంతరామయ్య సంపాదకవర్గ సభ్యులు. పేరుకు తగ్గ సాహితీ కృషి ఈ వ్యాసావళి. తెలుగు భాష, సాహిత్యం, చరిత్రలు ఈ గ్రంథాలకు వస్తువులు. తెలుగు సాహిత్య విజ్ఞాన కోశాలు.

నన్నయ నుండి 1968 వరకు నడిచిన సాహిత్య కృషి పై కాలానుసారంగా ఈ వ్యాసరచన సాగింది. ఈ ప్రత్యేక సంచికలు రెండూ అపురూపమైన వ్యాసాల్ని అమూల్యమైన కానుకగా తెలుగు పాఠక లోకానికి అందించాయి.

శ్రీ ముళ్ళపూడి తిమ్మరాజు కుమారుడు నరేంద్రనాథ్. చిన్నతనంలోనే నరేంద్రనాథ్ కాలం చేయడంతో తణుకులో అతని నామాంకితంగా శ్రీ నరేంద్రనాథ సాహిత్య మండలి పేరుతో సారస్వత సంస్థలు తిమ్మరాజుగారు స్థాపించారు. అది స్మృతి విపంచియై రమణీయరాగాలను మ్రోగిస్తూ ఆంధ్రదేశంలోనే సర్వతోముఖమైన సాహితీయాత్ర సాగించింది.

ధార్మికుడైన పారిశ్రామిక, రాజకీయవేత్త శ్రీ ముళ్లపూడి హరిచంద్ర ప్రసాద్. వారితండ్రి తిమ్మరాజుగారు. ఆయన లక్ష్మీపుత్రులు, ఉదార చరిత్రలు. ఆంధ్రభోజులే అనేకమంది కవి పండితులను ఆదరించి ఆశ్రయమిచ్చి కనకాభిషేకాలు చేశారు. సాహితీ వల్లభులై అనేక కృతులను అక్షర రూపంలో తెలుగువారికి అందించారు

***4.1) మొదటి భాగం*:** సాహిత్య విద్యార్థుల పరిశోధకుల గుండెల్లో కొత్త వెలుగులు నింపే 80 సాహిత్య వ్యాసాలు ఇందులో ఉన్నాయి. 15 వరకు సంస్కృత సాహిత్యానికి సంబంధించి భాసుడు,హాలుడు, కాళిదాసు,భారవి,మాఘుడు, శ్రీహర్షుడు, భవభూతి, ధ్వన్యాలోకం, వక్రోక్తి జీవితం, విద్యానాథుడు, జగన్నాథ పండితరాయలు వంటి అంశాలపై వ్యాసాలు ఉన్నాయి. తక్కినవి తెలుగు సాహిత్యం, సంస్కృతి, చరిత్ర అంశాలపై వ్యాసాలు. "రామాయణ రామణీయకము" అనేది ఇంద్రగంటి హనుమత్ శాస్త్రి గారి వ్యాసం. రామాయణాన్ని చదవడానికి పాఠకుని ఉండాల్సిన అర్హతను శాస్త్రిగారు ఇలా చెప్పారు.

డా. కేతవరపు వెంకటరామకోటి శాస్త్రి "శ్రీ మహాభారత నాయకుడు" వ్యాసంలో మహాభారత ఇతిహాసానికి నాయకుడు కృష్ణుడు గాని అర్జునుడు గాని కాదని ధర్మరాజు నాయకుడని తీర్మానించారు.

ISSN:3048-5908 Impact Factor:6.673(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-3, (July/Aug/Sept), 2026

ధూళిపాల అర్కసోమయాజి "కవికులపతి కాళిదాసు" వ్యాసంలో కాళిదాసు రచనలను పరామర్శించారు. అభిజ్ఞానశాకుంతలం గురించి రాస్తూ కాళిదాసు మహాకవి కీర్తి ప్రపంచమంతా విస్తరించిందని చెప్పడానికి పాశ్చాత్య విమర్శక శిరోమణి అనదగు గోథె పండితుడు ఆనందపడిన సన్నివేశాన్ని ఉదాహరించారు.

**"Wouldst thou the young year's blossoms**
**And the fruits of its decline**
**And all by which the soul is charmed**
**Enraptured,feasted fed**
**Wouldst thou the Earth the Heaven itself**
**In name thee 'O Sakuntala' And all at once is said"**

"వర్షాది వసంత సంజాయమాన కుసుమ సంజాతములు, వర్షాంత సంజాయమాన ఫల నికరంబులు నీ కొకేతరి కావలయున్నన్న దేని వలన నీ చేతము ఆనంద పరిప్లుతమై ఆహార పరిపుష్టమగునో అది నీకు కావలయునన్న, వేయేల! దేని వలన నీకు పృథివీ స్వర్గములు రెండును ఏక కాలికముగ కరతల గతములగునో అట్టిది "శకుంతలా" పఠనము చేత నీకు అవన్నియు సిద్ధించగలవు" అని గోథె మహాశయుడు కవితా లక్షణాల్ని ప్రతిపాదించాడు.

డా. ఎస్వీ జోగారావు "కాదంబరీ మహాకావ్య మధుర సందేశము"ను మనకు రమణీయంగా అందించారు. అందులోనూ జోగారావు గారి రచన అద్భుతంగా ఉంటుంది. భావితాంతఃకరణ శిరోమణి అయిన భట్టబాణుడు వినిపించిన కాదంబరీ కావ్య కచ్ఛపీశ్రుతులు ఎలా ప్రతిస్పందించాయో వివరించారు. ఇవి ఎవరికి వారుగా చదివి ఆ సాహిత్య జ్ఞానాన్ని పొందాలని ఇంతటి వ్యాసపరంపరనుఅందించే ప్రత్యేక సంచికలను శ్రద్ధ చేయాలన్నదే ఈ వ్యాసకర్త ప్రధాన ఉద్దేశం. అందుకే కొన్ని వ్యాసాల నుండి ముఖ్యమైన ఉదాహరణలు ఇస్తున్నదని గమనించాలి.

ఆంధ్ర దేశాన్ని పాలించిన కాకతీయ రాజవంశాలలో కాయస్థ వంశం కూడా ఒకటి. కాయస్థులు ఆంధ్ర దేశరాజులు కాదు. వారు ఉత్తర భారతదేశం నుంచి వచ్చారు. వారి చరిత్రను "కాయస్థ రాజులు" శీర్షికన నేలటూరి వెంకట రమణయ్య గారు 33 పుటల పరిశోధక వ్యాసం రాశారు. (స్వామి వివేకానంద కాయస్థ క్షత్రియులే) ఈ వ్యాసం ద్వారా 13వ శతాబ్దం నాటి ఆంధ్రదేశ చరిత్ర మనకు అవగతమవుతుంది.

కూచిపూడి చరిత్రను బందా కనక లింగేశ్వర రావు గారు "కూచిపూడి నృత్యం" వ్యాసంలో వివరించారు.

గుంటూరు శేషేంద్రశర్మ "శ్రీనాథ అవతార తత్వము", జటావల్లభుల పురుషోత్తం "మల్లినాథసూరి వ్యాఖ్యానవైభవం", కోవెల సుప్రసన్నాచార్యులు "ఆముక్తమాల్యదా కావ్య శిల్పము" కొత్త సత్యనారాయణ

ISSN:3048-5908 Impact Factor:6.673(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-3, (July/Aug/Sept), 2026

చౌదరి "వసుచరిత్ర విశిష్టత" వంటి వ్యాసరత్నాలు "సాహితీ వాల్లభ్య"సంచిక మొదటి భాగానికి ముఖ్యమైన అలంకారాలు.

***4.2) ద్వితీయ భాగం*:** సాహితీ వాల్లభ్యం మొదటి రెండు భాగాలు 1964 లోనే ప్రచురణకు సంబంధించిన పనులు మొదలైనా 1968 లో మొదటి భాగం పూర్తి చేయడం, అభినందనసభ జరగడం, ఆవిష్కరణ పూర్తవగా రెండవ భాగం మాత్రం 1974 నాటికి ప్రచురణ పూర్తయింది. మొదటి భాగం పూర్తిగా వ్యాసాల సమాహారం. రెండవ భాగంలో మాత్రం 67 సాహిత్య వ్యాసాలతో పాటు 31 పద్య గేయ ఖండికలున్నాయి. 610 పేజీల సంకలనంగా ప్రచురించారు.

దేవులపల్లి వెంకట కృష్ణశాస్త్రి "రవీంద్రుని ఉపనిషద్వాణి", వ్యాసం రవీంద్రుని రచనల్లోని సౌందర్య తత్వాన్ని వివరిస్తుంది.గూడా వెంకట సుబ్రహ్మణ్యం "తిరుపతి వెంకట కవుల సాహిత్య సేవ",

"తెలుగులో నా తొలి లిరిక్కులు" రాయప్రోలువారి వ్యాసం,గొర్రెపాటి వెంకటసుబ్బయ్య "జీవితచరిత్ర రచనా పద్ధతులు", జానపద సాహిత్యం గురించి నేదునూరి గంగాధరం గారు "జాతి సాహిత్యంలో జానపద సాహితీ విశిష్టత"లో జానపద సాహిత్యం పై విస్తృత పరిశోధనలు జరగాలని సాహిత్యాన్ని సేకరించాలని సూచించారు. దాని అవసరాన్ని ఇలా తెలిపారు ఏ పదం ఏనుడికారం ఇప్పుడు పుట్టింది ఎలా పుట్టింది ఏ విధంగా మారింది ఏ రూపాలెత్తి ఎక్కడినుంచి ఎక్కడికి చేరింది ఎప్పుడు ఏ మార్పు చెందింది ఎప్పుడు కూర్పు పొంది ఏ మండలంలో ఏ యాసతో ఉంది దేనిలో అందం ఉన్నది... వంటి భాషా విజ్ఞానాన్ని తెలుసుకోవడానికి జానపద సాహిత్య సంపుటాలు ఎక్కువగా ఉపకరిస్తాయి.

డా. జివి కృష్ణారావు "సాహిత్య భవితవ్యం", బుచ్చిబాబు "నవల లో కనబడని పాత్రలు", డా.పోణంగి శ్రీరామ అప్పారావు "కవి- నటుడు", దాశరథి "అభ్యుదయ సాహిత్య ఉద్యమం",స్ఫూర్తి శ్రీ "తెలుగులో ఉమర్ ఖయ్యాం" బాలమురళీకృష్ణ "లలిత సంగీతం" నటరాజ రామకృష్ణ "ఆంధ్రుల నాట్య కళ", సంజీవదేవ్ "చిత్రకళలోని వివిధ రీతులు" వంటి వ్యాసాలు ద్వితీయ సంపుటిని అలంకరించాయి.

***5) అక్షరార్చన*:** డా. పాటిబండ మాధవశర్మ షష్టిపూర్తి సన్మాన సంచిక "అక్షరార్చన". 1972లో ఈ సంచికను సన్మాన సంఘం ప్రచురించింది. ఆచార్య దివాకర్ల వెంకటావధాని, పల్లా దుర్గయ్య, డా. జివి సుబ్రహ్మణ్యం సంపాదకులు. 35 సాహిత్య వ్యాసాలతో 328 పుటల అపురూపమైన సాహిత్య వ్యాస సంకలనం. మాధవ శర్మగారు శిష్యుల భక్తిసంపత్తిని గడించుకున్న ఉత్తమ అధ్యాపకులు. స్నేహితుల మనసులను చూరగొన్న అమృతహృదయులు కాబట్టి వారి షష్టిపూర్తి మహోత్సవ సందర్భంగా వారి శిష్యులు,మిత్రులు వారు చేసిన సాహిత్య సేవకు జ్ఞాపకగా నిలిపిన కానుక "అక్షరార్చన" అందునా మాధవ

ISSN:3048-5908 Impact Factor:6.673(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-3, (July/Aug/Sept), 2026

శర్మగారి షష్టిపూర్తి సన్మాన సంఘానికి మాన్యశ్రీ ఎంఆర్ అప్పారావు అధ్యక్షులు, రావుల సాంబశివరావు, దేవులపల్లి రామానుజరావు, దివాకర్ల వెంకటావధాని, సి. నారాయణరెడ్డి, కల్వ సూర్యనారాయణ గుప్తా ఉపాధ్యక్షులు. జివి సుబ్రహ్మణ్యం, ఎంవి సుబ్బారావు కార్యదర్శులు. వీరంతా పేరు మోసిన సాహితీవేత్తలు. కావున సంచికను ప్రామాణిక వ్యాసాలతో ప్రచురించారు. అంతేకాక ఈ సంచికపై వచ్చిన ఆదాయాన్ని ఉస్మానియా విశ్వవిద్యాలయం నిర్వహించే ఎంఏ తెలుగు పరీక్షలలో సంస్కృతం అంశంలో ప్రథమంగా ఉత్తీర్ణుడైన విద్యార్థికి ప్రతి సంవత్సరం ఒక బంగారు పథకాన్ని బహూకరించడానికి ఏర్పాటు చేశారు.

ఒక అధ్యాపకుడు నిరాడంబరంగా సాహిత్యానికి సేవ చేసిన సందర్భంలో తన శిష్యులు తన మిత్రులు ఆదరాభిమానాలకు చిహ్నంగా ఇటువంటి సంచికను అక్షరార్చనగా పొందటం అది భావి విద్యార్థుల విద్యా ప్రోత్సాహకానికి పారితోషికంగా ఉండడం అనేది ఒక అపూర్వ సంఘటన గానే మనం భావించాలి. ఈ సంచిక ద్వారా విలువైన సాహిత్య వ్యాసాలు తెలుగు పాఠకలోకానికి అందాయి.

ఈ సంచికలో కొత్తపల్లి శ్రీ ఆంజనేయశర్మ "అపవాదు" అనే వ్యాసం జీవిస్తున్న వారిపై అపవాదులు వేస్తే తమ నిష్కలంకతను నిరూపించుకోవడానికి అవకాశం ఉంది కానీ మరణించిన వారిపై అపవాదులు వేస్తే పాపం వాళ్ళు ఏం చేస్తారు. 11 శతాబ్దంలో జీవించిన నన్నయ గారి గురించి 16 వ శతాబ్దం తర్వాత జీవించిన అప్పకవి అరణ్య పర్వం రాస్తున్న సమయంలో పిచ్చి పట్టి నన్నయ అరణ్యాల్లోకి వెళ్లిపోయాడని రాశాడు. నన్నయ మీద చల్లిన బురద అది. ఆ మధ్యలో 600 సంవత్సరాలు ఎక్కడా ఇటువంటి మాట లేదు. కాదని నిరూపించుకోవడానికి నన్నయగారు లేరు కదా. అప్పకవి చేతులకు మాత్రం బురద మిగులుతుంది. నన్నయ గారికి వచ్చిన నష్టమూ లేదు. అపవాదులు అంటే ఇలా ఉంటాయి. ఆంజనేయ శర్మగారు వ్యాసంలో రాజరాజ నరేంద్రుడికి జరిగిన అన్యాయం గురించి ఉంది. రాజరాజు నిష్కళంక మూర్తి. రాజరాజు గొప్పదనాన్ని నన్నయ గారి మహాభారత అవతారిక తెలియజేస్తుంది. మహారాష్ట్రలోని (మాళవదేశం) మాంధాతపురానికి చెందిన రాజమహేంద్రుడు కథలోని సారంగధరుడు, రత్నాంగి, చిత్రాంగి ఆంధ్రదేశంలోని రాజమహేంద్రవరానికి, రాజరాజ నరేంద్రునికి అంటగట్టారు. జానపద కథగా ప్రచారం చేశారు. సారంగధరమెట్ట అన్నారు. మహారాష్ట్ర కథల్లోని చౌరంగ నాథుడు రాజమండ్రిలో సారంగధరుడయ్యాడు. 15వ శతాబ్దానికి చెందిన గౌరన నవనాథ చరిత్రని ద్విపదలో రచించాడు. అది మహారాష్ట్రలో నాద సంప్రదాయానికి చెందిన సాహిత్యం. 16 శతాబ్దానికి చెందిన దోనూరి కోనేరునాథ కవి బాల భాగవతాన్ని రచిస్తూ రాజరాజ నరేంద్రునికి మహారాష్ట్రలో రాజమహేంద్రుని కథను ఆపాదింపజేశాడు. మధ్యలో ఆరు వందల సంవత్సరాలు ఉంది. జానపద కథనాల రూపంలో రాజమండ్రికి చేరి తిష్ఠ వేసుకుని కూర్చుంది. 17వ

ISSN:3048-5908 Impact Factor:6.673(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-3, (July/Aug/Sept), 2026

శతాబ్దంలో చేమకూర వెంకట కవి నవనాథచరిత్రను అనుసరిస్తూ మాంధాతపురాన్ని రాజమహేంద్రవరంగా రాజమహేంద్రుని రాజరాజ నరేంద్రునిగా మార్చి సారంగధర చరిత్ర అనే పేరుతో తంజావూరులో కూర్చుని కావ్యంగా రచించాడు. ఇప్పుడు కొత్త కథ కావ్యమైంది. అది ప్రసిద్ధమైంది. చిత్రాంగితో రసవత్తరమైంది. చెవులకు వినడానికి బాగుంది. 700 సంవత్సరాలుగా లేని కథ 300 సంవత్సరాలుగా చిలవలు పలవలయింది. నన్నయ గారి భారత అవతారికలోని రాజరాజు చాళుక్యుల వాస్తవ చరిత్రలో రాజరాజు సారంగధర చరిత్రలోని రాజరాజుగా మిగిలాడు. ఈ అపవాదు ఎవరు తొలగిస్తారు. ఎవరికి పని. ఎవరికీ నష్టంలేదు. లాభం అంతకన్నా లేదు. ఆంధ్రుల చరిత్ర పుటలకు అంటుకున్న బురద వలన ఎవరికి ఇబ్బంది. ఎవరికి అపవాదు. ఆంజనేయశర్మ గారు వేదనపడి ఆధారాలు చూపి రాజరాజ నరేంద్రుని పై పడ్డ అపవాదుని కూలంకషంగా వివరించి,చిత్రాంగి కథతో రాజరాజ నరేంద్రునికి ముడిపెట్టి రాసిన సాహిత్యాన్ని బహిష్కరించాలని తెలుగు బిడ్డల్ని కోరుకున్నారు. ఈ వ్యాసాన్ని తెలుగు వారందరూ చదివి తీరాలి. అంతేకాక నేటి పత్రికలు ఈ వ్యాసాన్ని పునర్ముద్రించాల్సిన అవసరం ఎంతో ఉంది.

ఇంకా... చేకూరి రామారావు "తెలుగులో ' అని ' చేసేపని" అని మంచి వ్యాసం ఉంది. నానా మాటలు అని, ప్రజాస్వామ్యం ఉందని, జీతాలు చాలా లేదని, స్కూటర్ ఇవ్వలేదని, కింద పడిందని, నువ్వే ముందు వచ్చావని, పిల్లి దూరిందని, టీచర్ వస్తున్నారని, ఓడిపోవాలని,.... ఇలా "అని"కున్న ప్రయోజనాలను చర్చించాలని పరిశోధనకు దిగి పది పుటల వ్యాసాన్ని కావాలని అందించారు.

కాళిదాస మహాకవి మేఘదూతానికి బీజం ఎక్కడుందో తెలిస్తే చాలా ఆశ్చర్యంగా ఉంటుంది. శ్రీమద్రామాయణంలో సీతాన్వేషణకి హనుమంతుడు సముద్ర లంఘనం చేసిన సందర్భంలో ఆయన ఆకాశంలో ఎగిరి వెళుతున్నప్పుడు వాల్మీకి మహర్షి ఆయన్ని మాటిమాటికి మేఘంతో పోలుస్తాడు. "రామదూత" అంటాడు. సుందరకాండలోని హనుమంతుని ప్రయాణం వివిధ వర్ణనలన్నీ కాళిదాస మహాకవి మేఘదూతంలో ఉన్నాయి. వీటన్నిటిని శ్రీ గుంటూరు శేషేంద్ర శర్మ గారు మేఘ దూతకు రామాయణంతో ఉన్న సంబంధం వ్యాసంలో చర్చించారు. వాల్మీకి మూడు మూర్తులా కాళిదాసులో వెలిశాడన్నారు.

సుదీర్ఘమైన మహత్తర వ్యాసం శ్రీమాన్ చలమచర్ల రంగాచార్యులు "కాటయవేముడు- కవ్వడి". సాహిత్యంలో, సమరంలో సమంగా విహరించగల వ్యక్తులు అరుదు. ఆంధ్రుల చరిత్రలో అటువంటివారు కొందరే. శ్రీకృష్ణదేవరాయలు, కుమారగిరి, పెద కోమటి వేమారెడ్డి, సర్వజ్ఞ సింగభూపాలుడు, రఘునాథ నాయకుడు వీరంతా సాహితీ సమరాంగణ సార్వభౌములు. ఆ కోవలో ఎన్నదగిన చక్రవర్తి కాటయ వేముడు. అతని వంశం, రాజ్యం, విజయయాత్రలు, ప్రతిభా పాండిత్యాలు కాళిదాస రూపకాలకు వ్యాఖ్యాన గ్రంథాలు.

నాట్యశాస్త్రం, వివిధ విషయాలలో పరిజ్ఞానం, కాటయవేమని కవిత్వం వంటి విషయాలను పరిశోధనాత్మకంగా విశ్లేషించారు. విశ్వవిద్యాలయాల పట్టా ప్రదాన విషయంలో ఇటువంటి వ్యాసాన్ని ఒక ఎం.ఫిల్ గా భావించవచ్చును.

తుమ్మపూడి కోటేశ్వరరావు గారి "రసము- లోకము", కాకర్ల వెంకట రామ నరసింహం "రసము- కెథార్సిస్", కేతవరపు రామకోటిశాస్త్రి "మహాభారతము న వేద వ్యాసుడు", నిడదవోలు వెంకటరావు "నన్నయ యతిప్రాసలు", జీవీ సుబ్రహ్మణ్యం "హంస డింభకోపాఖ్యానము- సంవిధాన శిల్పము", వేటూరి ఆనందమూర్తి "మన సంకీర్తన పద్ధతి- భాండాగారము", దివాకర్ల "ఆంధ్ర విమర్శ వాంగ్మయము", ఇరివెంటి కృష్ణమూర్తి "సాహిత్యము - యాధార్థ్యము", పోరంకి దక్షిణామూర్తి "మాండలికాలు".... వంటి వ్యాసాల్ని తెలుగు భాషా సాహిత్యాలను అధ్యయనం చేస్తున్న విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు తప్పనిసరిగా చదివి తీరాలి. అందుకనే ప్రత్యేక సంచికలు కంట పడ్డప్పుడు విషయ సూచికను విధిగా పరిశీలించాలి. వ్యాసాలను గుర్తుంచుకోవాలి. ఆయా సందర్భాల్లో అవి బాగా ఉపయోగపడతాయి. సాహిత్య జ్ఞాన సమపార్థులకు ఆధారాలుగా నిలుస్తాయి.

***6) శ్రీ రాజరాజ నరేంద్ర పట్టాభిషేక సంచిక*:** 1922 వ సంవత్సరంలో ఆంధ్రదేశీయేతిహాస పరిశోధక మండలి(రాజమహేంద్రవరం)వారు ప్రచురించిన ఈ సంచికకు సంపాదకులు శ్రీ భావరాజు వెంకటకృష్ణారావు. సందర్భం రాజరాజ నరేంద్రుని నవ శతాబ్ది వర్ధంతి. "తనయందుద్భవించిన మహా పురుషుల స్మరింపని జాతికి మోక్షము లేదు. ఆత్మవికాసము నశించిన జాతికి నాగరకత లేదు. గౌరవము లేదు. శుభములు కలుగవు. స్వాతంత్ర్యము నశించును. పారతంత్ర్యము వహించును... రాజరాజ స్మరణము జాతికి రానున్న భావికాల సభ సూచనము". రాజరాజు పట్టాభిషిక్తుడైన రోజు 1022 ఆగస్టు నెల16వ తేదీ భాద్రపద బహుళ విదియ. అపురూపమైన చిత్రపటాలతో పాటు ఈ సంచికలో చిలకమర్తి, కోలవెన్ను, రాయప్రోలు, మల్లంపల్లి, కొమర్రాజు, వేటూరి, మల్లాది సూర్యనారాయణశాస్త్రి, పారనంది రామశాస్త్రి, చిలుకూరి నారాయణరావు, వీరభద్రరావు, బుర్రా శేషగిరిరావు, గిడుగు రామమూర్తి, చెళ్లపిళ్ల, వసురాయకవి, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, జయంతి రామయ్య పంతులు, చెలికాని లచ్చారావు, దేశభట్ల లక్ష్మీనరసింహం, పెండ్యాల వెంకటసుబ్రహ్మణ్యం, ఎస్. కృష్ణ స్వామి అయ్యంగార్, తల్లాప్రగడ సూర్యనారాయణ రావు, కట్టమంచి, భావరాజు వెంకటకృష్ణారావు రచనలు ఉన్నాయి. సంచిక గొప్పతనం రచయిత పేర్ల వలన ఇనుమడిస్తుంది కదూ! అకారాది సూచిపత్రం అనుబంధంలో ఉండటం విశేషం. చరిత్ర, భాష, వాఙ్మయం, సాంఘిక పరిస్థితులు, శాసనాలు,అన్య విషయాలు, పద్యాలు అనే విషయ విభాగం ఉంది. అట్ట మీద వరాహలాంచనం

ముద్రింపబడి ఉండటం గమనీయం. నూతన సిద్ధాంత ప్రతిపాదనమున్న ఈ వ్యాసాలు సత్యాన్వేషణకు పురిగొల్పేలా ఉన్నాయి. చెదిరి ఉన్న చరిత్ర చాలావరకు ఇందులో సంపాదింపబడి ఉంది. రాజరాజు చాళుక్య వంశపురాజు. ఆ వంశానికి చెందిన రాజులు ఆంధ్ర దేశాన్ని పరిపాలించిన కాలాన్ని గురించి, ఆ కాలానికి చెందిన రాజుల గురించి విశేషాంశాలతో పాటు ఆంధ్ర కవిత్వ విశారదుని కవితా దక్షత, అక్షర రమ్యతలు ఆనుషంగికంగా సాహితీ ప్రియులు తెలుసుకోగలరు. ఇటువంటి అనేక అంశాలు కలిగిన ఈ సంచిక ఇటువంటి విభాగంలో ప్రథమ ప్రయత్నం. ఇందులో కొన్ని ఆంగ్లంలో రాయబడిన వాటికి అనువాదాలు. ఈ మొత్తం సంచిక ఆంగ్లీకరింపబడినచో ఆంధ్రేతరులకు కూడా ఆంధ్రుల గురించి తెలియగలదు.

ఈ సంచికను ఇటీవల గుంటూరు బొమ్మిడాల ఫౌండేషన్ వారు శ్రీ మోదుగుల రవికృష్ణ సంపాదకత్వంలో పునర్ముద్రించిన సందర్భం అభినందనీయం.

**ముగింపు:** ఈ సంచికలే గాక మరెన్నో ఇటువంటి విశేషాల్ని సంతరించుకున్నవి మరికొన్ని ఉండి తీరుతాయి. అటువంటి వాటిపై ఒక వ్యాసాన్ని రాసి ఏ పత్రికలోనో, పుస్తకంలోనో ప్రచురిస్తే అందరికీ తెలుస్తుంది. "ఆంధ్రప్రదేశ్" మాసపత్రిక 1994 ఏప్రిల్ ఉగాది ప్రత్యేక సంచికను తీసుకొని వచ్చింది. ఇందులోనూ మంచి సాహిత్య వ్యాసాలు ఉన్నాయి. ప్రపంచ తెలుగు సమాఖ్య నాలుగవ మహాసభల ప్రత్యేక సంచిక "తెలుగు జగతి" కూడా మంచి సంచిక. మూసీ, ప్రస్థానం, జాగృతి వంటి పత్రికలు కొన్ని ప్రత్యేక సంచికలు తీసుకుని వచ్చాయి. అవి ప్రస్తుతం దొరుకుతున్నాయి. శ్రీ ఎన్. వి. రమణయ్య కృషి ఫలితంగా నెల్లూరు జిల్లా కావలి నుండి వెలువడిన ప్రత్యేక సంచికలైన "అక్షర, పరిశోధన, ఇయర్ ఆఫ్ విజన్, మధు మురళి" వంటి వాటిగురించి ఒక ప్రత్యేక వ్యాసమే రాయాల్సిన అవసరం ఉంది.

శ్రీ మండలి బుద్ధ ప్రసాద్ నేతృత్వంలో కృష్ణాజిల్లా రచయితల సంఘం "వజ్ర భారతి, తెలుగు పసిడి, తెలుగు వ్యాసమండలి" వంటి వ్యాస సంకలనాలను ప్రచురించింది. ప్రసిద్ధ పుస్తకాల దుకాణాల్లో ఇవి లభ్యమవుతున్నాయి. 2012 డిసెంబర్లో జరిగిన నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభల ప్రత్యేక సంచికను కూడా చక్కని వ్యాసాలు సమాహారంగా ప్రచురించారు.

ప్రత్యేక సంచికల ద్వారా అద్భుతమైన సాహిత్య వ్యాసాలను తెలుగు పాఠక లోకానికి అందించారు. అటువంటి వాటిని అధ్యయనం చేసి అపారమైన సాహిత్య విజ్ఞానాన్ని తెలుగు పాఠకులు, సాహిత్య విద్యార్థులు, పరిశోధకులు పొందగలరని విశ్వసిస్తున్నాను.

ISSN:3048-5908 Impact Factor:6.673(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-3, (July/Aug/Sept), 2026

**ఆధార గ్రంథాలు**

1. త్రిలింగ రజతోత్సవ సంపుటము

2.bసరస్వతీ సామ్రాజ్యమ్

3. శాంతి

4. సాహితీ వాల్లభ్యము (ప్రథమ,ద్వితీయ సంపుటాలు)

4. అక్షరార్చన

5. శ్రీ రాజరాజ నరేంద్ర పట్టాభిషేక సంచిక.